సాక్షి శ్రీకాకుళం

బుధవారం, 15, ఫిబ్రవరి, 2023



పకడ్బందీగా పరీక్షలు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. నేడు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జరగనుంది. - 8లో



వీర సైనికులకు నివాళి

శ్రీకాకుళం కల్చరల్: పుల్వామా దాడిలో అసువులు బాసిన వారికి జేసీఐ నివాళులర్పించింది. శ్రీకాకుళంలో మంగళవారం కొవ్వత్తులతో ర్యాలీ చేశారు.

సెలవులో జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఈ నెలాఖరు వరకు సెలవులోకి వెళ్తున్నారు. ఆయన వివాహం చేసుకుంటున్న సందర్భంగా సెలవులపై వెళ్తున్నట్లు తెలిపారు. ఆయన స్థానంలో సీతంపేట ఐటీడీఏ పీఓ నవ్యకు ఇన్‌చార్జి జేసీ బాధ్యతలు అప్పగించారు. జేసీ నవీన్ తిరిగి మార్చి 1న విధుల్లోకి రానున్నారు. అప్పటి వరకు నవ్య ఇన్‌చార్జి జేసీగా వ్యవహరిస్తారు.

ఎత్తుల కత్తులు ఆధిపత్యపు జిత్తులు

- జిల్లా టీడీపీలో ఎక్కడికక్కడ గ్రూపులు
- అచ్చెన్న, లోకేష్ మధ్య పెరిగిన దూరం
- ఇదే అదునుగా పావులు కదుపుతున్న కళా
- ప్రతి నియోజకవర్గంలోనూ రాజుకుంటున్న విభేదాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



టీడీపీలో విభేదాలు రాజుకుంటున్నాయి. గ్రూపులుగా విడిపోయిన నాయకులు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు. ఒకరిపై ఒకరు రకరకాలుగా ఎటాక్ చేసుకుంటున్నా.... దానికి మౌనమని ఒకరు, కాలమే సమాధానం చెబుతుందని ఇంకొకరు... సమయం వచ్చాక చూపిస్తానంటూ మరొకరు సమర్థించుకుంటున్నారు. జిల్లాలో దాదాపు ప్రతి నియోజకవర్గంలో నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయి. కొందరు సీటు కోసమైతే, మరి కొందరు ఆధిపత్యం కోసం కాలు దువ్వుతున్నారు.

అధినేతల మధ్యే ఆధిపత్య పోరు



టీడీపీ నాయకుల మధ్య జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలోనూ విభేదాలు ఉన్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు కుమారుడు లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మధ్య గ్యాప్ ఉంది. తన ఇమేజ్ డ్యామేజ్ చేసేలా అచ్చెన్నాయుడు వ్యవహరిస్తున్నారని లోకేష్ కసితో ఉన్నారు. 'పార్టీ లేదు...--లేదు..' 'ఆడే బాగుంటే ఇంకేం కావాలి' అన్నట్టుగా తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో ఓ హోటల్‌లో అచ్చెన్నాయుడు అన్న మాటలు వైరల్ అయి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీని కుదిపేశాయి. అప్పటి నుంచి వారి మధ్య పోరు నడుస్తూనే ఉంది. అగ్నికి ఆజ్యం పోసినట్టు తాజాగా లోకేష్ చేస్తున్న పాదయాత్రపైన, హాజరవుతున్న జనంపైన, చేయాల్సిన జన సమీకరణపైన గంగాధర నెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి చిట్టిబాబునాయుడుతో అచ్చెన్నాయుడు ఫోన్ సంభాషణ బయటికి రావడంతో మరింత వేడెక్కించింది. పాదయాత్రపై ట్రోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అచ్చెన్నాయుడు ఆడియో సంభాషణ బయటకు రావడంతో టీడీపీలో కలకలం రేగింది.

అచ్చెన్న వర్సెస్ కళా



జిల్లా విషయానికొస్తే అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు మధ్య పచ్చగడ్డి వేయకపోయినా భగ్గుమంటోంది. జిల్లాలో ఆధిపత్యం కోసం ఇద్దరూ ప్రయత్నిస్తున్నారు. లోకేష్, అచ్చెన్న మధ్య ఉన్న అంతరాన్ని కళా వెంకటరావు క్యాష్ చేసుకుంటున్నారు. లోకేష్ పక్కన చేరి తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నారు. ఫలితంగా ప్రతి నియోజకవర్గంలో తనకో గ్రూపును ఏర్పాటు చేసుకుంటున్నారు. సహజంగానే అచ్చెన్నాయుడికి ఒక గ్రూపు ఉంటుంది. ఈ రెండు గ్రూపులను ప్రోత్సహిస్తూ జిల్లా టీడీపీలో రాజకీయాలు నెరుపుతున్నారు.

బాబాయ్, అబ్బాయ్‌ల మధ్య గ్యాప్



బాబాయ్ అచ్చెన్నాయుడు, అబ్బాయి ఎంపీ రామ్మోహన్‌నాయుడు మధ్య గ్యాప్ ఉన్నట్టుగా ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. లోకేష్‌తో అచ్చెన్నాయుడికి చెడడం వల్ల ఎక్కడ ఇబ్బంది వస్తుందోనన్న భయం రామ్మోహన్‌నాయుడులో ఉన్నట్టుగా వినిపిస్తోంది. అందులో భాగంగానే రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఆలోచనలో ఎంపీ ఉన్నారని, దానికి అచ్చెన్నా యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని టాక్ నడుస్తోంది. తనకు చెక్ పెట్టేలా అబ్బాయి నడుస్తున్నాడని, భవిష్యత్‌లో ముప్పుగా మారే అవకాశం ఉందనే అభద్రతా భావంతో అచ్చెన్నాయుడు ఉన్నట్టు టీడీపీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

కళా నియోజకవర్గంతో మొదలు

తనకు జిల్లాలో పోటీగా తయారైన కళా వెంకటరావుకు చెక్ పెట్టేందుకు అచ్చెన్నాయుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎచ్చెర్లలో పోటీ చేయాలనుకుంటున్న కళా వెంకటరావుకు, అదే నియోజకవర్గంలో రాజకీయంగా ఎదగాలని ఆరాటపడుతున్న కలిశెట్టి అప్పలనాయుడుకు అచ్చెన్న పరోక్షంగా సహకరిస్తున్నారు. అంతేకాకుండా తన ఇంటిలో మనిషిగా చెప్పుకునే చౌదరి బాబ్జీని కళాపై ఉసిగొల్పారు. తనను రాజకీయంగా అణగదొక్కాలని ప్రయత్నిస్తున్న కళాకు అడ్డుకట్ట వేయాలని అప్పటికే భావిస్తున్న చౌదరి బాబ్జీ కూడా ఇదే అవకాశంగా తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయకుడు అండ్ చౌదరి బాబ్జీ మధ్య గట్టిగానే యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే భూ అక్రమాలను బయటకు తీసుకువస్తున్నారు.

శ్రీకాకుళంలో తార స్థాయికి..

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం పార్టీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీ దంపతులకు, అచ్చెన్నాయుడుకు మధ్య సుదీర్ఘ కాలంగా విభేదాలున్న విషయం అందరికీ తెలిసిందే. రానున్న ఎన్నికల దృష్ట్యా గుండ లక్ష్మీకి టిక్కెట్ రాకూడదనే ఉద్దేశంతో అచ్చెన్నాయుడు పొగ పెట్టారు. నియోజకవర్గంలో యువ నాయకులైన గొండు శంకర్, కొర్ను ప్రతాప్‌లను రంగంలోకి దించారు. వారు కూడా గుండ ఫ్యామిలీతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. ఇంకేముంది సహజంగానే అచ్చెన్నకు ప్రత్యామ్నాయంగా ఉన్న కళా వెంకటరావుతో కలిసి గుండ ఫ్యామిలీ వ్యవహారాలు నడిపి, లోకేష్‌కు దగ్గరయ్యారు. అచ్చెన్నకు రిటర్న్ గిఫ్ట్‌లా గుండ ఫ్యామిలీకి కళా తోడుగా నిలుస్తున్నారు.

పాతపట్నంలో హైడ్రామా



పాతపట్నం నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు పెద్ద డ్రామానే నడిపిస్తున్నారు. ఒక వైపు నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణను ప్రోత్సహిస్తూనే మరోవైపు మామిడి గోవిందరావు అనే నాయకుడిని చెంతన పెట్టుకున్నారు. కాకపోతే, కూరలో కరివేపాకు మాదిరిగా మామిడి గోవిందరావును వాడుతామని బయటికి చెప్పేశారు. లోపాయికారీగా తనకు కూడా మాట ఇచ్చారన్న అభిప్రాయంతో 'మామిడి' చేతికొచ్చినంత ఖర్చు పెట్టి తానొక ఎమ్మెల్యే అభ్యర్థి ఆశావహుడినని నియోజకవర్గంలో తిరుగుతున్నారు. కలమట వెంకటరమణ మనుషులను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడే కలమట తన రాజకీయ చతురతతో అచ్చెన్నాయుడు, కూన రవికుమార్ మద్దతును కూడగట్టి 'మామిడి' వైపు వెళ్తున్న నాయకులకు పార్టీ పదవుల్లేకుండా, ఎలాంటి సహకారం అందించకుండా చెక్ పెడుతున్నారు. దీంతో ఈ కుట్రలను పసిగట్టిన మామిడి గోవిందరావు అటు అచ్చెన్నాయుడుతో పాటు కళా వెంకటరావు, లోకేష్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా లోకేష్‌ను, కళాను కలిసి లక్షల రూపాయలను పార్టీ ఫండ్ కింద ఇస్తున్నారు. అదే సందర్భంలో టిక్కెట్ కోసం మాట్లాడుతున్నారు. ఈయనకు ఏం హామీ వచ్చిందో గానీ అచ్చెన్న మాదిరిగానే మామిడి గోవిందరావు కూడా డబుల్ గేమ్ ఆడుతున్నారు.

మిగతా చోట్ల..

- అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గం టెక్కలిలో కూడా నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయి. టీడీపీ సీనియర్ నేత బగాది శేషు, ల్యాడి శ్రీనివాస్ మధ్య విభేదాలు ఇటీవల రచ్చకెక్కాయి. తనకు బినామీగా ఉన్న జూనియర్ నేత ల్యాడి శ్రీనివాస్‌కే అచ్చెన్న కొమ్ము కాయడంతో సీనియర్లు మండి పడుతున్నారు.
- పలాస నియోజకవర్గంలో కూడా నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయి. టూరిస్టు మాదిరిగా నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతు శిరీష రాజకీయం చేస్తుండటాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ పార్టీ నాయకులు కొందరు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారు. ఆ క్రమంలో జుత్తు తాతారావు అనే వ్యక్తి తెరపైకి వచ్చారు. టిక్కెట్ కోసం పోటీ పడుతూ గౌతు శిరీష, జుత్తు తాతారావు నువ్వానేనా అంటున్నారు. రెండు వర్గాలు గా విడిపోయి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు.
- ఇదే మాదిరిగా నరసన్నపేటలో కూడా వర్గ రాజకీయాలు చేస్తున్నారు.
- ఆమదాలవలసలో సాగడం లేదు గానీ కొందరు నాయకులు కూన రవికుమార్‌పైన ఆవేదనతో ఉన్నారు.

న్యూస్‌రీల్

శివరాత్రికి 560 మందితో బందోబస్తు



స్వామి దర్శనంలో ఎస్పీ రాధిక

జలుమూరు: శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు 560 మందితో పూర్తిస్థాయి బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఆమె మంగళవారం శ్రీముఖలింగం వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం క్యూలైన్‌లు, బారికేడ్లు, చక్రతీర్థ స్నానాల రేవును పరిశీలించారు. శివరాత్రి రోజు 280 మంది పోలీసులతో, మూడో రోజు స్వామి చక్రతీర్థ స్నానాల నాడు అదనంగా మరో 280 మందితో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. భక్తులకు స్వామి దర్శనం సులువుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమెతోపాటు డీఎస్పీ బాలరాజు, సీఐ డి.రాము, ఎస్.ఐ పారినాయుడు అర్చకులు, ఈఓ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ నాటికి గుర్రపు డెక్క తొలగింపు



సమీక్ష చేస్తున్న వంశధార ఎస్ఈ

నరసన్నపేట: వంశధార కాలువల్లో గుర్రపు డెక్క తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేస్తామని వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు అన్నారు. నరసన్నపేట వంశధార ఈఈ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన ముందుగా ఇంజినీర్లతో సమీక్షించారు. కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం వంశధార కాలువల్లో నీరు సరఫరా చేస్తున్నామని, మార్చి వరకూ నీరు ఇస్తామన్నారు. అనంతరం కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. కేటగిరీ ఎ కింద ఉన్న రూ.4.5కోట్ల నిధులతో కొత్త పనులు చేస్తామన్నారు

ఉద్దానంలో కిడ్నీ పరిశోధన బృందం పర్యటన



కిడ్నీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పరిశోధన బృందం

వజ్రపుకొత్తూరు రూరల్: కోవిడ్ అనంతరం ఉద్దాన ప్రజల ఆరోగ్య పరిస్థితి, కిడ్నీ వ్యాధి మూలాలు తెలుసుకునేందుకు పరిశోధన బృందం ఉద్దాన ప్రాంతంలో మంగళవారం పర్యటించింది. పలాస మండలం బొడ్డపాడు, వజ్రపుకొత్తూరు మండలంలో గల పల్లిసారథి, గొల్లసారథి గ్రామాల్లో జార్జ్ ఇన్‌స్టిట్యూట్, ఐసీఎంఆర్ బృందాలు సంయుక్తంగా పర్యటించాయి. ఈ సందర్భంగా కోవిడ్ బారిన పడిన వారు, టీకాలు వేసుకున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రక్త నమూనాలు సేకరించారు. కొద్ది మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కిడ్నీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో పరిశోధన వైద్య బృంద సభ్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ షైని, డాక్టర్ కవిత, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీకేడీ కౌన్సిలర్ టి.దుర్యోధన ఉన్నారు.

డచ్ భవనానికి కొత్త టచ్

- నిర్మాణాన్ని పరిశీలించిన నెదర్లాండ్స్ ప్రతినిధి



నెదర్లాండ్స్ ప్రతినిధికి డచ్ భవనం వివరాలు తెలియజేస్తున్న ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని అతి పురాతన డచ్ భవనం సుందరీకరణ, పరిరక్షణ, అధ్యయనం కోసం నెదర్లాండ్స్‌కు చెందిన ఆర్కియాలజీ ప్రొఫెసర్ కెనాల్ టానిఫ్, ఒడిశా రాష్ట్రం నుంచి ప్రొఫెసర్ సంజయ్ మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఇంటాక్ సభ్యుల బృందం వారికి భవన విశేషాలను వివరించారు. భవనం సుందరీకరణ కోసం గతంలో వేసిన ప్రతిపాదనలు అందించామని ఇంటాక్ పూర్వ కన్వీనర్ కేవీజే రాధాప్రసాద్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథం నాయుడు తెలిపారు. భవనాన్ని పరిశీలించిన బృందం దీన్ని అభివృద్ధి చేసేందుకు సాయం చేస్తామన్నారని, ప్రస్తుతం ఉన్న భవన రూపురేఖలు మారకుండా చేసేందుకు కోసం కృషి జరుగుతున్నట్లు చెప్పారన్నారు. ఈ భవనాన్ని మ్యూజియంగా గానీ, గెస్టుహౌస్‌గా గానీ మార్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పినట్లు తెలిపారు. మన జిల్లాకు చెందిన పురాతన సంపద హైదరాబాద్ మ్యూజియంలో ఉందని, వాటిని ఇక్కడ పెట్టేందుకు గతంలో కలెక్టర్లు నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇంటాక్ ఆర్కియాలజిస్టు హారికాప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి నారాయణ రావు, ఇంటాక్ కో కన్వీనర్ నటుకుల మోహన్, గీతాశ్రీకాంత్ పాల్గొన్నారు.

40 ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ ఆలయం సమీపంలో పోలీసుల తనిఖీల్లో 40 ఒడిశా మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎల్ఎన్ పేట మండలం చిన్నకొల్లివలస గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వద్ద 40 ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు.

పరిణయ ఘడియ



మంగళ సూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న వేదపండితులు

వాసుదేవుడు వరుడయ్యాడు. శ్రీదేవి, భూదేవిలను కల్యాణమాడేందుకు మందస దిగి వచ్చాడు. మందసలోని వాసుదేవ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంత్రి సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు ఈ క్రతువులో పాల్గొని తరించారు. ఆలయ అభివృద్ధికి రూ.50వేలు అందించారు. చిన్న జీయరు స్వామి ప్రధాన శిష్యులు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. – మందస



మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

46 రోజులు.. రూ.82.55 లక్షలు

- రికార్డు స్థాయిలో ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 46 రోజుల్లోనే రూ.82,55,164 మేరకు ఆదాయం లభించింది. గత రికార్డులను పరిశీలిస్తే 2021 మార్చిలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో గరిష్టంగా రూ.67,99,225 ఆదాయం లభించగా.. తాజా లెక్కింపుతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. రథసప్తమి ఒక్కరోజే వివిధ దర్శనాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా కూడా రికార్డు స్థాయిలో రూ.48 లక్షలకు మించి ఆదాయం సమకూరిన సంగతి విదితమే. ఇప్పుడు తాజాగా రథసప్తమి అనంతరం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపుల్లో మళ్లీ రికార్డు స్థాయిలోనే రూ.82.55 లక్షల ఆదాయం లభించడం ఓ రికార్డు. అయితే ఎప్పటిలాగానే నకిలీ కళ్లు మళ్లీ కనిపించాయి. హుండీల్లో భారీగా బయటపడిన నకిలీ వెండి, బంగారం కళ్లను అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు చేయించి తగలబెట్టారు.

నగదు రూపంలోనే రూ.81 లక్షలు

గత ఏడాది డిసెంబర్ 30 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 14 వరకు గల మొక్కుల లెక్కింపు ప్రక్రియ మంగళవారం స్థానిక ఆలయ అనివెట్టి మండపంలో ప్రశాంతంగా జరిగింది. ఈ లెక్కింపులో అధికంగా నగదు రూపంలో రూ. 80,01,117, చిల్లర రూపంలో రూ.2,54,047 మేర ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటు 58 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 3 కిలోల 390 గ్రాముల వెండి వస్తువులు మొక్కులుగా లభించినట్లుగా తెలిపారు. వీటితో పాటు విదేశీ మారక ద్రవ్యం రూపంలో కూడా మొక్కులను విదేశీ భక్తులు చెల్లించుకున్నారు.

కార్యక్రమాన్ని రామతీర్థం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించగా, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బీవీవీఆర్ ప్రసాద్ పట్నాయక్, సీనియర్ అసిస్టెంట్లు రవికుమార్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పలువురు స్వచ్ఛంద సేవకులు, భక్తులు ఈ కానుకల లెక్కింపులో పాల్గొన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ బందోబస్తు నిర్వహించారు.

బుడితి వస్తువుల మార్కెటింగ్‌కు చర్యలు



కంచు, ఇత్తడి వస్తువుల తయారీదారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

సారవకోట: బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమలో తయారైన వస్తువులకు మార్కెటింగ్ కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని చీడిపూడి గ్రామంలో బుడితి, చీడిపూడి, అవలింగి గ్రామాల్లో కంచు, ఇత్తడి వస్తువులు తయారీదారులు, కార్మికులతో వస్తువుల తయారీ, మార్కెటింగ్, బ్యాంకుల ఆర్థిక సాయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం ద్వారా బుడితి కంచు, ఇత్తడి కార్మికులతో పలు అంశాలపై చర్చించారు. తాము తయారు చేస్తున్న వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని వారు కోరగా.. ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ద్వారా మార్కెటింగ్ చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే తయారీదారులు సంఘాలుగా ఏర్పడితే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని, ఆ రుణాలతో మరింత ఉత్పత్తి పెంచేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు పరిశ్రమల శాఖ ఏడీ రఘునాథరావు, చిన్నతరహా పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

'గ్రాడ్యుయేట్' ఎన్నికలకు సన్నద్ధం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ నవ్య తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలి ఎన్నికలపై రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి చేసిన ఏర్పాట్లపై ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ నవ్య వివరించారు. జిల్లాలో 59 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, 51,186 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. పోలింగ్ బాక్సులను సిద్ధం చేశామన్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయి లో మూడు డివిజన్లకు మూడు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు టీమ్‌లు, మండల స్థాయిలో 30 మండలాలకు గాను మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు టీమ్‌లు 30 ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఎంపీడీఓల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు మండలానికి ఓ టీమ్ చొప్పున తహసీల్దార్ పరిధిలోనూ, జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ లెవెల్ టీమ్ ఒకటి సిద్ధం చేశామన్నారు. 71 మంది ప్రొసీడింగ్ అధికారులు, 71 మంది పోలింగ్ అధికారులు, 212 మంది అదనపు పోలింగ్ అధికారులు, 71 మంది మైక్రో అబ్జర్వర్లు (బ్యాంకు అధికారులు), 12 మంది జోనల్ అధికారులు మొత్తం 432 మందిని ఎన్నికలకు సిద్ధం చేశామని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఎన్నికల విభాగానికి చెందిన సిబ్బంది ప్రకాశ్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాంపస్ నియామకాలపై ప్రత్యేక దృష్టి


వర్చువల్ సదస్సులో పాల్గొన్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: కళాశాలల్లో క్యాంపస్ డ్రైవ్‌ల ద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యమివ్వనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యామండలి మంగళవారం నిర్వహించిన వర్చువల్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్రో సహకారంతో డిగ్రీ విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్‌ల ఎంపికలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. బీఎస్సీ, బీసీఏ డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా క్యాంపస్ ఎంపికల్లో ప్యాకేజీలు సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు సైతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విషయ పరిజ్ఞానంతో ముందుకు సాగాలన్నారు. ఉపాధి లక్ష్యంగా ఇంటర్న్‌షిప్ పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

యువతిని కబళించిన కిడ్నీవ్యాధి


పూజిత(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన దుమ్ము పూజిత(19) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. ఈమెకు కిడ్నీ సమస్య ఉన్నట్లు ఐదు నెలల కిందట బయటపడింది. మృతురాలి తండ్రి దుమ్ము పాపారావు కొన్నాళ్ల కిందట కిడ్నీ వ్యాధితోనే మృతి చెందగా తల్లి రోహిణి రోజువారి కూలీ పనులు చేసుకుంటూ పూజితను ఇంటర్మీడియెట్ వరకు చదివించింది. పూజితకు సోదరుడు తేజేశ్వరరావు ఉన్నారు. యువతి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బొడ్డపాడులో గడ్డికుప్ప దగ్ధం


కాలిపోయిన గడ్డి

పలాస: పలాస మండలం బొడ్డపాడులో మంగళవారం సుమారు రూ.40 వేలు విలువైన వరి గడ్డి కుప్ప దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొడ్డు బారికయ్య తన పశువుల కోసం ఇటీవల గడ్డిని కొనుగోలు తోటలో భద్రపరిచాడు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే గడ్డికుప్పను తగలబెట్టారని బారికయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలిసిన వెంటనే కాశీబుగ్గ అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే పూర్తిగా గడ్డి కాలిపోయింది.

రేషన్ సరఫరా చేయలేదని ఫిర్యాదు

టెక్కలి: నందిగాం మండలం హరిదాసుపురం రేషన్ డిపో పరిధిలో రెండు నెలలుగా రేషన్ ఇవ్వలేదంటూ గ్రామానికి చెందిన కె.భాగ్యలక్ష్మి, బి.యమున, జి.శ్రావణి తదితరులు మంగళవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సుమారు 65 రేషన్ కార్డుదారుల నుంచి వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలు, టెక్కలి, పలాస తదితర ఆర్టీసీ బస్ డిపోలకు హెచ్‌ఎస్‌డీ ఆయిల్ సరఫరా చేసేందుకు జిల్లాలోని ఆసక్తిగల హెచ్‌ఎస్‌డీ ఆయిల్ బంక్ యజమానుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఈ నెల 14 నుంచి 20 వరకూ శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపో మేనేజర్ల కార్యాలయాల్లో లభిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 21 ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ టెండర్ ఫారాలు స్వీకరిస్తామని, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరుస్తామని పేర్కొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

పకడ్బందీగా పరీక్షలు

- ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు నేడు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష
- 17న ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష
- 20 నుంచి ఒకేషనల్, 26 నుంచి జనరల్ ప్రాక్టికల్స్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు


శ్రీకాకుళంలోని ఓ జూనియర్ కళాశాలలో పరీక్షకు సిద్ధం చేసిన ఫర్నిచర్

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ పరీక్షల పర్వం బుధవారంతో ప్రారంభంకానుంది. ఈ నెల 15, 17 తేదీల్లో జరిగే తప్పనిసరి పరీక్షలకు ఫస్టియర్ విద్యార్థులు విధిగా హాజరై ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ నెల 20 నుంచి ఒకేషనల్, ఈ నెల 26 నుంచి జనరల్ కోర్సుల సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఆరంభంకానున్నాయి. మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్ థియరీ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తీర్ణత సాధించాల్సిందే..

ఇంటర్మీడియెట్ ఫస్టియర్ విద్యార్థులకు మంగళవారం నైతికతా, మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష జరగనుంది. ఈ నెల 17వన పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష జరగనుంది. ఈ రెండు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి. జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు గతంలో ఈ రెండు పరీక్షలు రాయని/ఉత్తీర్ణులుకాని విద్యార్థులు కూడా హాజరు కావాలని అధికారులు సూచిస్తున్నారు.

25581 మంది సంసిద్ధం..

ఈనెల 15, 17వ తేదీల్లో జరిగే ఈ రెండు తప్పనిసరి పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జవాబుపత్రాలు, నామినల్‌రోల్స్, ఇతర పరీక్షల సామగ్రిని చేరవేశారు. ఆయా కళాశాలల్లో లెక్చరర్లే ఇన్విజిలేటర్లగా, ఎగ్జామినర్లగా వ్యవహరించి జవాబుపత్రాలను దిద్దుబాటు చేస్తారు. ఆ మార్కులను జ్ఞానభూమిలోని బోర్డు వెబ్‌సైట్‌లో నమోదుచేయనున్నారు. జిల్లాలో 166 జూనియర్ కళాశాలలు ఉండగా 51475 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 25581 మంది ప్రథమ, 25894 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అన్ని మేనేజ్‌మెంట్ల జూనియర్ కాలేజీల్లో 15న జరిగే ఎథిక్స్ హ్యూమన్‌వాల్యూస్, 17న జరిగే ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలకు ఫస్టియర్ విద్యార్థులు 25581 మంది రాయనున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



జిల్లాలో నేడు జరిగే నైతికత, మానవతా విలువల పరీక్షకు, ఈ నెల 17న జరిగే పర్యావరణ విద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. పరీక్షల నిర్వహణకు అన్ని కాలేజీలకు మెటీరియల్స్ చేరవేశాం. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయి. వాల్యుయేషన్ చేసి మార్కులు పోస్ట్ చేయాలి. పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలి.

– ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ, శ్రీకాకుళం

జీఓ 110 అమలుపై హర్షం


వీసీ వెంకటరావును కలిసిన బోధన సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జీఓ 110 ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వేతనాలు ఖరారు చేసి అమలుచేయడంతో కాంట్రాక్ట్ బోధన సిబ్బంది మంగళవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీఓ 110 అమలు వల్ల భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయని, మెరుగైన వేతనాలు లభిస్తాయని వీసీ చెప్పారు. ప్రభుత్వ జీవో అధ్యయనానికి నిపుణులతో కూడిన కమిటీ వేసి వేతనాలు ఖరారు చేశామన్నారు. ప్రస్తుతం రూ. 57700 గరిష్ట వేతనం లభిస్తుందన్నారు. విశ్వవిద్యాలయంలో 78 కాంట్రాక్టు బోధన సిబ్బంది ఉండగా, 70 మందికి కొత్త జీఓ వల్ల ప్రయోజనం చేకూరిందని చెప్పారు. కొందరికి మాత్రం నిబంధనలు వల్ల వేతనం తగ్గిందని, భవిష్యత్తులో ఏటా పెంపు వల్ల వారికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పాత వేతనాలు కావాలంటే 110 జీవీ ప్రయోజనాలు వర్తించబోవని స్పష్టం చేశారు. అర్హత, అనుభవం, డాక్టరేట్, నెట్, స్లెట్ వంటి అర్హతలు ప్రామాణికంగా వేతనాలు ఖరారు చేసినట్లు చెప్పారు. మరోవైపు వర్సిటీలో సీఎఫ్‌ఎంఎస్ ద్వారా జీతాలు పొందుతున్న వారందరికీ ఏపీ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ అమలు చేయనున్నట్లు వీసీ తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు, ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో బోధకులు పరిశోధనలు, జర్నల్స్ పబ్లికేషన్స్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు, ఉపాధి కోర్సులు ప్రారంభిస్తామని చెప్పారు.

25, 26 తేదీల్లో కార్మిక సంఘాల మహాసభలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 9వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు సంఘ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం తంగివానిపేటలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అప్పలరాజు, అప్పారావు, చిన్నారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి సరికొత్త 'హీరో జూమ్ 110'


జూమ్ 110 స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గూడేన సోమేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : దేశంలోనే నంబర్ వన్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ మార్కెట్‌లోకి సరికొత్తగా జూమ్ 110 పేరిట స్కూటర్‌ను విడుదల చేసింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ కూడలి వద్ద ఉన్న వరం హీరో సెంటర్‌లో ప్రముఖ వైద్యులు గూడేన సోమేశ్వరరావు, సామాజిక వ్యాపారవేత్త నటుకుల మోహన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై హీరో సెంటర్ అధినేత అంధవరపు ప్రసాద్ సమక్షంలో స్కూటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ టీవీఎస్ జూపిటర్, హోండా యాక్టివా వంటి స్కూటర్లతో జూమ్ 110 పోటీపడనుందని చెప్పారు. మూడు వేరియంట్లలో (ఎల్ఎక్స్, వీఎక్స్, జెడ్ఎక్స్) అందుబాటులో ఉంటుందన్నారు. డాక్టర్ సోమేశ్వరరావు మాట్లాడుతూ బ్లూటూత్ కనెక్టివిటీ, టెలీస్కోపిక్ సస్పెన్షన్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, ఆకర్షణీయ డిజైన్లలో ప్రత్యేకంగా జూమ్ నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహనరావు, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపికలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

టెక్కలి: హైదరాబాద్‌లోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు మంగళవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీ సీనియర్ మేనేజర్ చాణుక్య, హెచ్ఆర్ జ్యోత్స్న పర్యవేక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 20 మంది హాజరయ్యారు. అదే విధంగా, హైదరాబాద్, విశాఖలోని ఫార్మా కంపెనీల్లో శిక్షణ, ఉద్యోగాలకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 20న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. గ్రాన్యూల్ ఇండియా, గ్రావిటీ ఫార్మా, న్యూలాండ్ ఫార్మా, హెటిరో డ్రగ్స్, వసుధ ఫార్మా, శ్రీకృష్ణ ఫార్మా తదితర కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ కెమిస్ట్రీ పాస్/ఫెయిల్, ఇంటర్మీడియెట్ అన్ని గ్రూపులు, ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర విద్యార్హతలతో 25 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8328191643, 8688080562 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఫేస్‌యాప్ హాజరు మినహాయించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ రెవెన్యూ సహాయకులకు ఫేస్‌యాప్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రికవరీ చేసిన డీఏ తిరిగి చెల్లించాలని, అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.త్రినాథరావు, సీతప్పడు, జి.వెంకటరమణ, మల్లేశు, కె.రమణమూర్తి, బి.అప్పారావు, రాములమ్మ, లక్ష్మి, మీనాక్షి, వాసు, దేవుడు పాల్గొన్నారు.

శిష్టకరణ జాతీయ సమావేశాలు విజయవంతం


కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న శిష్టకరణ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : ఆలిండియా శిష్టకరణ సంఘ సమావేశాలు ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణ సంఘ అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో శిష్టకరణ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. జాతీయ అధ్యక్షులు డి.వి.కృష్ణారావు, కార్యదర్శి ఏపీఎస్ నాగార్జునల నేతృత్వంలో కమిటీ శిష్టకరణాలను ఓబీసీలో చేర్చడానికి సంబంధించి ఛలో ఢిల్లీ నిర్వహించాలని నిర్ణయించారు. విద్యార్థులకు, ఉద్యోగార్థులకు స్టడీ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలని తీర్మానించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు కోవ లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, నాగార్జున, యు.జె.ఎం.రావు, గుమ్మా ఉమాశంకర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిమ్మయ్య

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం సమీపంలో జాతీయ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి సిమ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సారవకోట మండలం కిడిగి గ్రామానికి చెందిన సిమ్మయ్య టెక్కలిలో ఒక పండ్ల వ్యాపారి వద్ద పనిచేస్తూ తిర్లంగిలో యజమాని ఇంటి వద్దనే నివాసముంటున్నాడు. మంగళవారం పనులు ముగించుకుని తిర్లంగి వెళ్లేందుకు అక్కవరం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సిమ్మయ్య తల, కాలుకు తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటనకు కారణమైన కారును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

● మంచు దుప్పటి



మంచు ముంచేసింది. మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా మంచు కురిసింది. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల పరిధిలో భారీగా మంచు కురుస్తున్న దృశ్యాన్ని ఇక్కడ చూడొచ్చు.

– కాశీబుగ్గ

ఉత్తరాంధ్ర పట్టభద్రులు 2,87,258 మంది

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. తుది ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియగా.. మంగళవారం నాటికి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2,87,258 మంది ఓటర్లు ఉన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకు వచ్చే నెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 2,87,258 మంది ఓటర్లలో పురుషులు 1,80,891, మహిళలు 1,06,329, ట్రాన్స్‌జెండర్లు(టీజీ) 38 మంది ఉన్నారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాలో 52196 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 36,361 మంది, మహిళలు 15,830 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో దరహాస్‌కు మూడు పతకాలు


పతకాలతో దరహాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిక్కోలు కుర్రాడు వేమకోటి దనుష్య దరహాస్ సత్తాచాటాడు. కృష్ణా జిల్లా ఈడుపుగల్లు వేదికగా ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో కాంస్యం, 200 మీటర్ల ఐఎం విభాగంలో కాంస్య పతకాలు సాధించి శభాష్ అనిపించాడు. శ్రీకాకుళంలోని శ్రీచైతన్య ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న దరహాస్ పతకాలతో రాణించడం పట్ల శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం పి.నర్సునాయుడు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏవో బుజ్జిబాబు, సిబ్బంది, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, తదితరులు అభినందించారు.

● వేషాలు 'గావు'.. ఆచారాలు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురంలో మంగళవారం నిర్వహించిన గావు సంబరంలో జానపదం ఝుల్లుమంది. ఈ పండగను కొన్ని కుటుంబాల వారు కలిపి నిర్వహించుకునే సంప్రదాయం అనాదిగా ఉంది. పండగ నిర్వహిస్తున్న వారి ఇంటిలో ఒకరు ఆడపిల్ల వేషం కట్టుకుని నృత్యం చేస్తారు కూడా. తప్పెటగుళ్ల దరువులతో ఈ పండగ దద్దరిల్లింది.

– కాశీబుగ్గ

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన కొర్లాన చిన్నబాబు భార్య సుమిత్ర (24) ఈ నెల 5వ తేదీ రాత్రి ఇంట్లో వంటచేస్తూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గాయపడింది. ఈ ఘటనలో చిన్నబాబుకు సైతం గాయాలు కావడంతో ఇద్దరినీ టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సుమిత్ర పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ముందుగా శ్రీకాకుళం రిమ్స్‌కు అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం మృతదేహానికి శవపంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. టెక్కలి ఎస్ఐ ఎల్ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ద్విచక్ర వాహనంపై అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ మంగళవారం ఇద్దరు వ్యక్తులు ఇచ్ఛాపురం పోలీసులకు పట్టుబడ్డారు. ఇచ్ఛాపురం సీఐ ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్ మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బరంపురం నుంచి బైక్‌పై సంతోష్‌కుమార్ మహంతి, కైలాష్ చంద్ర బెహరాలు ప్లాస్టిక్ సంచిలో గంజాయిని ఇచ్ఛాపురం సమీపంలో పురుషోత్తపురానికి చెందిన రెయ్యి నరసింహులుకు విక్రయిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. గంజాయి 16 కిలోలు ఉందని, దీని విలువ సుమారు రూ.64,000 వరకు ఉంటుందని అంచనా వేశారు. ఘటనకు సంబంధించి బైక్‌తోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ కె.గోవిందరావు పాల్గొన్నారు.

రైలు దిగుతూ జారిపడి యువకుడు మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గంజాం జిల్లా తుంబాగడ గ్రామానికి చెందిన పింటూ నాయక్ (28) అతని స్నేహితుడితో కలిసి తిరుపతి- సంత్రాగచ్చి వెళ్తున్న రైలును చెన్నై స్టేషన్ వద్ద ఎక్కాడు. అయితే ఇచ్ఛాపురం స్టేషన్ నుంచి తమ స్వగ్రామం దగ్గర కావడంతో రైలు మెల్లగా కదులుతున్న సమయంలో స్నేహితుడు సురక్షితంగా దూకాడు. పింటూ నాయక్ కూడా అదే తరహాలో దిగేందుకు ప్రయత్నించగా జారిపడి మృతిచెందాడు. ఇతనికి ఆరు నెలల క్రితమై వివాహమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే షరీఫ్ తెలిపారు.